సాక్షి వనపర్తి

శనివారం । 17 । ఆగస్టు । 2024



జూరాలకు తగ్గిన వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది.

వివరాలు 10లో ▸



మెగా జాబ్‌మేళా

కోస్గిలో శనివారం మెగా జాబ్ మేళాను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.8 /24.7

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

ఎడమ కాల్వకు మహర్దశ

భూత్పూర్ రిజర్వాయర్ నుంచి అమరచింత వరకు



జలకళను సంతరించుకున్న భూత్పూర్ రిజర్వాయర్

- 32 కిలోమీటర్ల పొడవు.. 24 చెరువులకు ప్రధాన ఆధారం
- ఎమ్మెల్యే చొరవతో పనుల్లో కదలిక
- ప్రస్తుత ఆయకట్టు 20,518 ఎకరాలు

అమరచింత: నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించేందుకు భూత్పూర్ రిజర్వాయర్ ప్రధాన ఎడమ కాల్వను నిర్మించారు. మక్తల్, నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని సుమారు 24 చిన్న, పెద్ద చెరువులు నింపుతూ ఆయకట్టుకు సాగునీటిని వదులుతున్నారు. నిర్వహణ లేక కాల్వలో ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో పాటు లైనింగ్, డిస్ట్రిబ్యూటరీలు దెబ్బతిన్నాయి. దీంతో రిజర్వాయర్ నుంచి కాల్వకు నీరు వదిలినా చివరి చెరువు వరకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని అసంపూర్తి పనులతో పాటు పూడిక తొలగింపు, లైనింగ్ పనులకు ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామని ఇటీవల ప్రకటించారు. దీంతో వచ్చే వానాకాలం నాటికి చివరి ఆయకట్టు రైతుకు సైతం సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు సంబరపడుతున్నారు.



అమరచింత శివారులో కాల్వను పరిశీలిస్తున్న డీఈ, ఏఈ

జలయజ్ఞంతో మొదలు..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన జలయజ్ఞం కార్యక్రమంలో భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో సుమారు రూ.60 కోట్లతో రిజర్వాయర్‌తో పాటు కుడి, ఎడమ కాల్వలు నిర్మించేందుకు సిద్ధమయ్యారు. రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందక పనులు అసంపూర్తిగా వదిలేశారు. చెరువులను నింపేందుకు కాల్వ వెంట నీటిని వదులుతూ వచ్చారు. పదేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పూడిక పేరుకుపోయి ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో పాటు డిస్ట్రిబ్యూటరీలు దెబ్బతిని నీరు ముందుకు పారని పరిస్థితి నెలకొంది.

రైతుల శ్రమదానంతో..

అమరచింత, పాంరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్ రైతులు నాలుగేళ్లుగా శ్రమదానంతో కాల్వలోని పూడిక, ముళ్లపొదల తొలగింపు కార్యక్రమాలు చేపడుతున్నారు. వీరికి అమరచింతకు చెందిన మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఆర్థిక సహకారం అందించి మరమ్మతులకు ప్రోత్సహిస్తున్నారు.

ఎమ్మెల్యే పరిశీలనలో..

15 రోజుల కిందట భూత్పూర్ రిజర్వాయర్ ఎడమ కాల్వకు సాగునీరు విడుదల చేసిన ఎమ్మెల్యే కాల్వ పరిధిలోని చెరువులకు నీరు చేరుతుందా లేదా పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. పూడిక, ముళ్లపొదల తొలగింపు, డిస్ట్రిబ్యూటరీలు, కెనాల్ చాలన్‌ల మరమ్మతుకు ఎన్ని నిధులు కావాలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆనందంగా ఉంది..



గత ప్రభుత్వం భూత్పూర్ రిజర్వాయర్‌ను పూర్తిగా విస్మరించింది. నిర్వహణ లేక కాల్వ దెబ్బతినడమే కాకుండా ముళ్లపొదలు ఏపుగా పెరిగి నీరు ముందుకు పారని పరిస్థితి. రైతులందరం కలిసి ముళ్లపొదలు తొలగించి చెరువును నింపుకొనేవాళ్లం. ఎమ్మెల్యే కాల్వ మరమ్మతులు చేయిస్తామని చెప్పడం ఆనందంగా ఉంది.

– మహ్మద్ కౌసర్, రైతు, నాగల్‌కడ్మూర్

చివరి చెరువుకు నీరందక ఇబ్బంది..



అమరచింత పెద్ద చెరువును నీటితో నింపేందుకు దేశాయి ప్రకాష్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి పూడిక తొలగించారు. ఎమ్మెల్యే రిజర్వాయర్ నుంచి చివరి చెరువు వరకు ఉన్న కాల్వ మరమ్మతుతో పాటు నీటి ప్రవాహ ఎత్తును పెంచుతామని ప్రకటించడం హర్షణీయం.

– పోసిరిగారి విష్ణు, రైతు, అమరచింత

రైతు ప్రయోజనాలే ముఖ్యం..



నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం. ఇందులో భాగంగా భూత్పూర్ రిజర్వాయర్ ప్రధాన ఎడమ కాల్వను పూర్తిస్థాయిలో అధ్యయనం చేశాం. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈని ఆదేశించాం. త్వరలోనే నిధులు మంజూరు చేయించి మరమ్మతులు పూర్తి చేస్తాం.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

డిస్ట్రిబ్యూటరీలతో సమస్య..

ప్రధాన ఎడమ కాల్వ పరిధిలో 26 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. ప్రస్తుతం వాటిలో సగానికి పైగా పనిచేయడం లేదు. ఉపాధి కూలీలతో కాల్వ వెంట ఉన్న ముళ్లపొదలు తొలగించాం. కొన్నిచోట్ల యంత్రాలతో పనులు చేయాల్సి ఉంది.సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నివేదిక అందించాలని ఎమ్మెల్యే కోరారు.

– మోహన్, ఏఈ, భూత్పూర్ రిజర్వాయర్

బ్యాంకర్లు లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. చిత్రంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి: వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాలను 100 శాతం సాధించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2016 తర్వాత ఉమ్మడి జిల్లాలో సాగు నీటి లభ్యత పెరిగి రైతుల ఆర్థిక స్తోమత పెరిగిందన్నారు. పంట రుణమాఫీ నిధులు రూ.400 కోట్లు జిల్లా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3,454.92 కోట్లు వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు వార్షిక రుణ ప్రణాళిక రూపొందించగా.. 2024, జూన్ వరకు కేవలం రూ.324.92 కోట్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. విద్య, గృహ నిర్మాణం తదితర రంగాలకు రూ.3,961 కోట్లు లక్ష్యం కాగా.. ఇచ్చింది మాత్రం రూ.386.28 కోట్లని వివరించారు. జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని, వ్యవసాయ రుణాలతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రుణ సదుపాయం ఉన్న రంగాలపై యువతకు అవగాహన కల్పించాలన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు..

రైతులు పంట రుణాలకు వచ్చినప్పుడు ఇబ్బందులకు గురిచేయకుండా మంజూరు చేయాలని కోరారు. కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయని, రుణమాఫీ జరిగిన తర్వాత తిరిగి రుణాలు అడిగితే అభ్యంతరాలు చెబుతున్నాయని కొందరు రైతులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. అసైన్డ్, లావణి పట్టా భూములకు రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. స్పందించిన కలెక్టర్ అసైన్డ్ భూములు ఇంకొకరికి అమ్మడానికి వీలు లేదని.. వ్యవసాయ రుణం తీసుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవన్నారు. ప్రతి మంగళవారం రైతువేదికల్లో రైతుసభలు నిర్వహిస్తారని.. బ్యాంకర్లు హాజరై రుణాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టరేట్ కాంప్లెక్స్, వనపర్తి సమీకృత మార్కెట్ సముదాయంలో కొత్తగా బ్యాంకులు, ఏటీఎం సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎల్‌డీఓ రిజర్వ్ బ్యాంకు రెహమాన్, నాబార్డ్ ఏజీఎం మనోహర్‌రెడ్డి, ఏపీజీవీబీ ఆర్‌ఎం రంజిత్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, యూనియన్ బ్యాంక్ ఏజీఎం మురళి, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకర్లు, వివిధ మండలాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలి

పాన్‌గల్: చివరి ఆయకట్టు వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల, కిష్టాపూర్, గోప్లాపూర్ పరిధిలోని కేఎల్‌ఐ డి–8, మైనర్ కాల్వలను ఆయన అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 29 ప్యాకేజీ ప్రధాన కాల్వ 14 కి.మీ. వద్ద షట్టర్లు కిందకు దించి సాగునీరు సాఫీగా వెళ్లేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే కాల్వల్లో పేరుకుపోయిన పూడిక వెంటనే తొలగించి చివరి ఆయకట్టుకు నీరందించాలన్నారు. గత ప్రభుత్వం తప్పిదంతో లెవెల్స్ సక్రమంగా చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని.. సంబంధిత అధికారులు కాల్వలను పర్యవేక్షించాలని కోరారు. కాల్వలో నీరు పారేందుకు తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి పూర్తి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు రవికుమార్, వెంకటేష్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, రాముయాదవ్, బ్రహ్మయ్య, గోపాల్‌రావు, పుల్లారావు, బాలరాజుయాదవ్, ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు ఉన్నారు.

వర'మహా'లక్ష్మి



శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పెబ్బేరులోని షిర్డీ సాయిబాబా, అయప్ప ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ వ్రత క్రతువు పూర్తిచేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆయా ఆలయాల సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

– పెబ్బేరు రూరల్

న్యూస్‌రీల్

పరిశుభ్రతతో వ్యాధులు దూరం : డీఎంహెచ్‌ఓ



పెబ్బేరు రూరల్: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాల బారిన పడకుండా ఉంటామని డీఎంహెచ్‌ఓ డా. జయచంద్రమోహన్ అన్నారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని రెండో వార్డుతో పాటు మండలంలోని కంచిరావుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దోమలు, వ్యాధులు ప్రబలిన ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించాలని అధికారులకు సూచించారు. డెంగీ, మలేరియా బారిన పడకుండా ఇళ్ల ఎదుట వృథాగా ఉన్న హౌజ్‌లలోని నిల్వ నీటిని పారబోయించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఆయన వెంట పుర చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, కమిషనర్ ఆది శేషు, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్‌ఎం లావణ్య, వెంకటనర్సమ్మ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఉద్యాన విద్యార్థుల ఎంపిక



కొత్తకోట రూరల్: జిల్లాకేంద్రంలో ఈ నెల 15న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెద్దమందడి మండలం మోజర్ల కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య తెలిపారు. అండర్–23 బాలుర విభాగంలో షార్ట్‌పుట్, డిస్కస్‌త్రోలో అరుణ్‌కుమార్, లాంగ్‌జంప్‌లో బాలికల విభాగంలో జి.హారిక, 1,500 మీటర్ల పరుగు పందెం పురుషుల విభాగంలో పి.వంశీకృష్ణ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఈ నెల 17, 18 తేదీల్లో మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, అదేవిధంగా జాతీయస్థాయికి ఎంపిక కావాలని కళాశాల అధ్యాపక బృందం ఆకాంక్షించింది. కార్యక్రమంలో ఓఎస్‌ఏ డా. రాజశేఖర్, ప్రొ. పూర్ణిమమిశ్రా, ఫిజికల్ డైరెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే సాగునీటి కష్టాలు : బీఆర్‌ఎస్

వనపర్తి: ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే రైతులకు సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి సమీపంలోని చెరువును బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ.. శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా వనపర్తి శివారు, మండల చెరువులు నింపే అవకాశం ఉన్నా పాలకులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చెరువులు నింపి సాగునీరు అందించకపోతే బీఆర్‌ఎస్ తరఫున చీఫ్ ఇంజినీర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పలుస రమేష్‌గౌడ్, వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు కంచె రవి, తిరుమల్, నాగన్నయాదవ్, రహీం, బండారు కృష్ణ, ప్రేమేందర్‌రెడ్డి, దేవర్ల నర్సింహ, రఘువర్ధన్‌రెడ్డి, పరంజ్యోతి తదితరులు ఉన్నారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు : ఎమ్మెల్యే

ఆత్మకూర్: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని.. అందరూ కలిసిమెలిసి ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని పిన్నంచర్లలో ఆంజనేయస్వామి ఆలయ పునః నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయాల అభివృద్ధికి పాటుపడుతున్నారని.. ఈ ఆలయ పునః నిర్మాణానికి దేవాదాయశాఖ తరఫున రూ.50 లక్షలు మంజూరయ్యాని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసిరాజ్, నల్గొండ శ్రీను, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, శ్రీనివాస్‌గుప్తా, చంద్రశేఖర్‌రెడ్డి, బంగారు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి



తిర్మలాపూర్‌లో మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ఉదయం 9 గంటలకు పాఠశాలలకు చేరుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో రెండోజత యూనిఫామ్స్ ఇవ్వలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని.. శనివారం సాయంత్రంలోపు అందజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని.. విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. ఈ ఏడాది 10వ తరగతి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగాలని.. అందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. ఇచ్చిన సూచనలు నేటి నుంచి అమలు చేయాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన..

గోపాలపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాలని, ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని జయన్న తిర్మలాపూర్‌లో పర్యటించి గత నెలలో డెంగీ కేసు నమోదైన ఇంటిని సందర్శించారు. వారితో మాట్లాడి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని.. నీరు ఎక్కువ రోజులు నిల్వ కుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం పాత నీటిని పారబోయాలని కాలనీవాసులకు సూచించారు. జ్వరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించి వ్యాధి లక్షణాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట గోపాల్‌పేట ప్రత్యేక అధికారి లక్ష్మీబాయి, కార్యక్రమ అధికారి సాయినాథ్‌రెడ్డి, తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీకి మెరుగైన ఆదాయం : ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండుగ రోజు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులు కష్టపడి పని చేసి మంచి ఆదాయం తెద్దామని రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా రూపొందించిన ఈపీకే బుక్‌లను పలువురు కండక్టర్లకు ఆర్‌ఎం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రీజియన్‌లో ఇప్పటి వరకు 1,800 బుక్‌లను పంపిణీ చేశామని, ఈ నూతన బుక్‌లో ఆర్టీసీకి సంబంధించిన పథకాలు, రోడ్డు ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రాసుకోవాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా రోజు ఎంత ఈపీకే వచ్చింది.. మహాలక్ష్మి పథకం వివరాలను కండక్టర్ పొందుపరచాల్సి ఉంటుందన్నారు. బుక్‌లో ఏ విధంగా రాయాలో వివరించారు.

సాగని బోధన

- ఉమ్మడి జిల్లాలో తరగతుల బోధనకు ఉపాధ్యాయులు కరువు
- డీఎస్సీ ద్వారా భర్తీ ఆలస్యం.. 2 వేలకుపైగా ఖాళీలు
- 'పేట'లో విద్యావలంటీర్ల స్థానంలో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం
- మిగతా నాలుగు జిల్లాలకు కేటాయించని ప్రభుత్వం



తెలంగాణ– కర్ణాటక సరిహద్దు గ్రామమైన బోయలగూడెం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు బోధిస్తున్నారు. ఇందులో 453 మంది చదువుకుంటుండగా కేవలం ఐదుగురు గణితం– 1, ఎస్జీటీ ఉపాధ్యాయులు నలుగురు మాత్రమే ఉన్నారు. అయితే తెలుగు, హిందీ, సోషల్ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు ఎస్జీటీ పోస్టులు, ఇంగ్లిష్, జీవశాస్త్రం పోస్టులు ప్రభుత్వం మంజూరు చేయలేదు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో రెండు నెలల పాటు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల హడావుడిగా సాగింది. దీంతో చాలా చోట్ల పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. దీని ప్రభావం బోధనపై పడింది. అయితే ఆయా ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా ఈ ప్రక్రియ పూర్తి అయ్యేందుకు మరింత సమయం పట్టనుంది. గతంలో ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో విద్యా వలంటీర్లను నియమించేవారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం వారిని నియమించడం లేదు. విద్యార్థులకు విద్యాబోధనలో ఇబ్బందులు తలెత్తకుండా వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. ఈ మేరకు ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న దగ్గర నుంచి బదిలీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 350 నుంచి 500 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పేటకు ప్రత్యేక పోస్టులు..

ఉమ్మడి జిల్లాలో 2 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి స్థానంలో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో కొన్ని జిల్లాలకు అనుమతి ఇచ్చింది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి కేవలం ఒక్క నారాయణపేటకు 233 మందిని తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ భర్తీని త్వరలోనే చేపట్టనున్నట్లు నారాయణపేట డీఈఓ అబ్దుల్‌ఘనీ పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బీఈడీ, టెట్ వంటి అర్హతలు, ఎస్జీటీ పోస్టులకు డీఎడ్, టెట్ వంటి అర్హతలు నిర్ధారించారు. స్థానికంగా ఉండే వారికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. వీరు కొత్తగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల భర్తీ జరిగే వరకు మాత్రమే పని చేయనున్నారని సమాచారం.

2 వేలకుపైగా ఖాళీలు..

2018లో చివరిసారిగా ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేసింది. ఆ తర్వాత గతేడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. తక్కువ పోస్టుల భర్తీకి అనుమతివ్వడంతో అభ్యర్థులు నిరసన బాటపట్టారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 1,131 పోస్టుల భర్తీకి అనుమతించింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 273, పండిట్లు 102, పీఈటీలు 25, ఎస్జీటీలు 584, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 147 పోస్టులు ఉన్నాయి. అయితే వాస్తవ ఖాళీలు 2 వేలకు పైగా ఉండటంతో చాలాచోట్ల ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు బోధన కష్టతరంగా మారింది. ఎక్కువగా నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల వంటి ప్రాంతాల్లో సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులు లేరు. ఈ ప్రభావం ఎస్సెస్సీ పరీక్షలపై పడే అవకాశం ఉంది. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యా వలంటీర్లనైనా నియమించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



గద్వాల జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1,180 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి బోధించేందుకు మొత్తం 42 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా.. 24 పోస్టులు మాత్రమే మంజూరు ఉన్నాయి. వాటిలో కూడా 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 19 మంది మాత్రమే పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో సబ్జెక్టు, లాంగ్వేజ్‌లకు సంబంధించి బోధన కష్టసాధ్యంగా మారింది. వెంటనే ఆయా పోస్టులు మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు..



నారాయణపేట జిల్లాలో 545 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఈ ప్రభావం విద్యా బోధనపై పడొద్దని ప్రభుత్వం 233 అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అనుమతిచ్చింది. వాటికి అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తాం. మరిన్ని పోస్టుల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేసేందుకు ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. కలెక్టర్ అనుమతితో ఆ ప్రక్రియ కూడా పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– అబ్దుల్ ఘనీ, డీఈఓ, నారాయణపేట

కలెక్టర్ అనుమతితో..



జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నచోటి నుంచి అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా బదిలీ చేసేందుకు ప్రక్రియ కొనసాగుతుంది. కలెక్టర్ అనుమతితో ఈ బదిలీలు చేపడుతాం. జిల్లాలో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. – రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

మూడుకు చేరిన మృతుల సంఖ్య


ప్రియాంక (ఫైల్)

అలంపూర్: ఉండవెల్లి స్టేజీ సమీపంలోని వర సిద్ధి వినాయక కాటన్ మిల్లు వద్ద గురువారం కూలీలతో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొన్న ఘటన పాఠకులకు విదితమే. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే లక్ష్మీదేవి మృతి చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రమాదేవి అలియాస్ సుజాత మృతి చెందింది. ప్రియాంక, అనిత పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రియాంక (19) తలకు బలమైన గాయం కావడంతో శుక్రవారం మృతి చెందినట్లు ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అనిత పరిస్థితి కూడా విషమంగానే ఉందన్నారు. దీంతో ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది.

బావిలో పడి బాలిక మృతి


బావిలో పడి మృతి చెందిన మౌనిక

గట్టు: మండల పరిధిలోని తారాపురంలో బాలిక పొలం వద్ద బావిలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తారాపురానికి చెందిన ఆంజనేయులుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తె మౌనిక(10) గ్రామంలోనే ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుకుంటుంది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల అనంతరం మౌనిక మరో బాలికతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లింది. పొలంలో ఉన్న బావి వద్దకు దాహం తీర్చుకునేందుకు వెళ్లిన క్రమంలో.. ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. పక్కనే ఉన్న మరో బాలిక విషయాన్ని గమనించి, కొద్ది దూరంలోని తండ్రి ఆంజనేయులుకు తెలియజేసింది. తండ్రి ఆంజనేయులు బావి వద్దకు వచ్చి చూసే సరికి అప్పటికే మృతిచెందింది. మృతదేహాన్ని బయటకు తీసి, శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

వడదెబ్బతో వ్యక్తి ..

మానవపాడు: ఎండలు ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జల్లాపురం శివారులో గురువారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల మద్దిలేటి(44), భార్య లలితమ్మ, కుమారులతో కలిసి గురువారం వ్యవసాయ పనులు వెళ్లారు. పనులు చేస్తుండగా ఎండ ఎక్కువగా ఉండడంతో కళ్లు తిరుగుతున్నాయని మద్దిలేటి చెట్టుకిందకు వెళ్లాడు. కానీ పరిస్థితి అలాగే ఉండడంతో కుటుంబసభ్యులు ఆటో పిలిపించి మానవపాడులోని ఆరోగ్యకేంద్రంనకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అందించి మెరుగైనా వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మద్దిలేటి మృతిచెందాడని నిర్ధారించారు. ఘటనపై లలితమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

బీడీల కోసం రోడ్డు దాటుతూ..

మహబూబ్‌నగర్ క్రైం: బీడీలు తీసుకోవడానికి రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..హన్వాడ మండలం వేపూర్‌నకు చెందిన యాదయ్య(45) కొన్ని రోజుల నుంచి కుటుంబంతో కలిసి పట్టణంలో అద్దెకు ఉంటూ వంట మాస్టర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అయితే శుక్రవారం మధ్యాహ్నం లక్ష్మీగార్డెన్ దగ్గర వంట చేయడం కోసం వచ్చాడు. ఈ క్రమంలోనే బీడీలు తీసుకొచ్చుకుందామని రోడ్డు అవతల వైపునకు బయలుదేరాడు. కాగా రోడ్డు దాటుతున్న అతడిని ఓ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడే ప్రాణాలు వదిలాడు. యాదయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రమాద ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

తీజ్ సంబురం

సంస్కృతి, సంప్రదాయబద్ధంగా గిరిజన యువతుల వేడుక


మంచెపై గోధుమలు నానబెట్టిన తీజ్ బుట్టలు..

- తొమ్మిదిరోజులపాటు గోధుమ నారుకు పూజలు
- నియమ నిష్టలు, ఆటపాటలతో సందడి
- చివరిరోజు చెరువులు, కుంటల్లో నిమజ్జనం
- నల్లమలలో మొదలైన మొలకల పండుగ

అచ్చంపేట: నల్లమలలో లంబాడా గిరిజనుల (బంజారాలు) సంప్రదాయ మొలకల పండుగను ఉత్సవంగా నిర్వహించుకుంటున్నారు. కఠోర నియమాలు, డప్పుల మోతలు.. తండావాసుల కేరింతలు.. పెళ్లి కాని ఆడబిడ్డల ఆటపాటలు.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలు.. భక్తిభావం వీటి మేళవింపే తొమ్మిది రోజుల (నవ దాడేరి తీజ్) పండుగ. ఆషాఢం, శ్రావణమాసంలో బంజారాలు తీజ్ వేడుకలను తమ సంస్కృతిని ప్రతిబింబించేలా జరుపుకొంటారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా ఈ పండుగ నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ గ్రామాలు, తండాలు, పట్టణాల్లో సైతం తీజ్ సందడి నెలకొంది. సేవాలాల్ మహారాజ్ (సేవాభాయి), దండి మేరమ్మ (అమ్మవారు) తల్లికి పూజలు చేసే క్రమంలో తీజ్ వేడుకలు నిర్వహిస్తారు. పెళ్లి కాని యువతులు తమకు మంచి వరుడు రావాలని, తండావాసులు పాడి పంటలు, పిల్లాపాపలు చల్లగా ఉండాలని వేడుకుంటూ తొమ్మిది రోజులపాటు తీజ్ పండగ జరుపుకొంటారు. ఒకప్పుడు తండాలకే పరిమితమైన ఈ వేడుకలు ఇప్పుడు పట్టణాలకూ విస్తరించాయి. ఈ క్రమంలోనే అచ్చంపేట గిరిజన భవన్ వద్ద శనివారం నుంచి 25 వరకు ఈ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఏడుగురు దేవతలు..

లంబడా తెగ గిరిజనులకు ఏడుగురు స్త్రీ దేవతలు ఉన్నారు. మేరామ, హింగళ, తుల్జా, కేంకాళి, తీజ్, మత్రాళ్, సీత్ల అనే దేవతల పేర్ల మీదుగా నిర్వహించేవి ప్రధాన పండుగలు. మేరామ దేవత తండాను రక్షిస్తే.. తీజ్ దేవత పంటలను కాపాడుతుందని నమ్ముతారు. సీత్ల దేవత పశు సంపదను వృద్ధి చేస్తుందని, మత్రాళ్ దేవత పిల్లలు అంటువ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని విశ్వసిస్తారు. వివిధ ప్రాంతాల్లో ఉండే బంధువులంతా పండుగల సందర్భంగా కలుసుకొని ఆత్మీయత, అనురాగాలను పంచుకుంటారు. యుక్త వయస్సు ఉన్న గిరిజన యువతులు విద్య, ఉద్యోగ, సంసారిక జీవితం, పుట్టినింటితోపాటు మెట్టినిల్లు కూడా అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో తుల తూగాలంటూ ప్రతిఏటా మొలకల పండుగ నిర్వహిస్తారు.

ముఖ్యమైన పండుగ..

గిరిజనులకు ముఖ్యమైన పండుగలలో తీజ్ ఒకటి. తీజ్ ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు ఇస్తే మరింత ఉత్సాహంగా జరుపుకొంటాం. ప్రస్తుతం గిరిజనులు డబ్బులు పోగు చేసి వేడుకలు నిర్వహిస్తున్నాం. కరువు కాటకాల నుంచి కాపాడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి.. పంటలు బాగా పండాలని వేడుకుంటాం. అచ్చంపేట గిరిజన్ భవన్ వద్ద శనివారం నుంచి 25 వరకు పెద్దఎత్తున మొలకల పండుగ నిర్వహిస్తున్నాం.

– శంకర్‌రాథోడ్, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, అచ్చంపేట

ఉపవాసాలతో పూజలు



తీజ్ ఉత్సవాన్ని తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక నిష్టతో జాగరణలో ఉంటూ పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటాం. ఉత్సవాలు ముగిసే వరకు తండాను వదిలి బయటకు వెళ్లకుండా ఉండాలి. ఉత్సవాలు మొదలైన రోజు నుంచి ఒకపూట భోజనం చేస్తాం. చివరిరోజు పూర్తిగా ఉపవాస దీక్షతో ఉంటాం. తండా నాయకులు, తల్లిదండ్రులు, సోదరుల సహకారంతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తాం.

– పాత్లావత్ నిఖిత, కన్యతండా, అచ్చంపేట

పార్వతీదేవినే భవాని మాతగా..



పురాణాల్లో పేర్కొన్న కథల ప్రకారం శివపార్వతుల ప్రేమకు గుర్తుగా జరుపుకొనేదే తీజ్ పండుగ. శివుడిని ప్రసన్నం చేసుకోవడానికి పార్వతీదేవి సుదీర్ఘకాలం పాటు ఉపవాస దీక్షలు చేపట్టింది. శివుడు తనను వివాహం చేసుకుంటానని మాట ఇచ్చిన తర్వాత దీక్ష విరమించింది. దీక్షతో లక్ష్యాన్ని సాధించుకున్నందున పార్వతిని భవానిగా కొలుస్తున్నాం.

– రాత్లావత్ రుక్మిణి, జ్యోతినాయక్ తండా, అచ్చంపేట

పండుగ విశిష్టత..


జ్యోతినాయక్ తండాలో..

తీజ్ పండుగను గిరిజనులు తొమ్మిది రోజుల పాటు జరుపుకొంటారు. ఆయా రోజుల్లో యువతులు రొట్టెలు, ఆకుకూరలు మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. బుట్టలు ఎందరు ఉంచినా అందులో ఐదుగురు యువతులు మాత్రమే నిష్టతో పూజ చేస్తారు. చివరిరోజు యువతులు మొలకల బుట్టలను తలపై పెట్టుకొని చెరువు వద్దకు వెళ్తారు. అప్పటికే అక్కడ సంప్రదాయ పద్ధతిలో రుమాలాలు తలకు చుట్టుకొని పెద్ద మనుషులు కూర్చుంటారు. యువతులు బుట్టల్లోని కొన్ని మొలకలను తలపాగాల్లో వేస్తారు. అనంతరం బుట్టలకు పూజలు చేసి చెరువులో వదులుతారు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత పెద్ద మనుషుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. యువతులను కూడా పీటలపై కూర్చోబెట్టి పెద్ద మనుషులు వారి కాళ్లు కడిగి ఆశీర్వదిస్తారు. పుట్టిన ప్రతి గిరిజన యువతికి పెళ్లి జరిగే నాటికి తీజ్ పండుగను ఆ కుటుంబ సభ్యులు నిర్వహించడం ఆనవాయితీ.

రేగిచెట్టుకు పూజలు చేసి..

పెళ్లికాని యువతులు రేగిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తీజ్ వేడుకలను ప్రారంభిస్తారు. అంతకు ముందే తండాల్లోని పెద్దలు ప్రతి ఇంటి నుంచి గోధుమలు సేకరించి రోజంతా నీళ్లలో నానబెడతారు. పెళ్లికాని యువతులు చిన్న చిన్న వెదురు బుట్టలో పుట్టమన్ను గోవు పిడకల చూర్ణాన్ని కలిపి నాయక్ (పూజారి) ఇంటికి తీసుకువస్తే ఆయన భార్య ఆ బుట్టలో నానబెట్టిన గోధుమలు వేసి అలుకుతుంది. అనంతరం పూజలు చేసి బుట్టలను డాగ్డో (మంచెలాంటి)పై ఉంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక జలాలు చల్లుతూ ఉత్సవాలు నిర్వహిస్తారు.

సర్దార్ పాపన్నగౌడ్ స్ఫూర్తితో పనిచేస్తా


విగ్రహ దాత వంగ మణెమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): ప్రజల ఆదరించడం వల్లే తాను ఈ రోజు ఎమ్మెల్యేగా ఎదిగానని, సర్దార్ పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవచేస్తానని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్‌ను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుని చిరకాలం గుర్తుండేలా సేవ చేయాలన్నారు. శుక్రవారం తిమ్మాజిపేటలో సర్వాయి పాపన్నగౌడ్ నూతన విగ్రహాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ తనకు జరిగిన అవమానంతోపాటు దోపిడికి గురవుతున్న ప్రజలను రక్షించడానికి అన్నివర్గాలతో సైన్యం ఏర్పాటు చేసుకుని పోరాటం చేశారన్నారు. సామాన్య ప్రజల బాగు కోసం ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ పాలనలో గౌడ్లకు గుర్తింపు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో గౌడ సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూశామని, వారికి మద్యం దుకాణాల్లో 15 శాతం వాటా వచ్చేలా కృషిచేశామన్నారు. అదేవిధంగా కల్లు దుకాణాలకు రెంటల్ రెన్యువల్ పదేళ్ల వరకు కనీసం లైసెన్సు కూడా అడగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాగా చేస్తే మరో ఐదేళ్లు పాలిస్తుందని, లేకుంటే ప్రజలు తమకు అవకాశం ఇస్తారన్నారు. అనంతరం సర్వాయి పాపన్నగౌడు విగ్రహ దాత వంగ మణెమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ్‌గౌడ్, వేణగోపాల్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్


వెల్దండలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని వివరాలు వెల్లడిస్తున్న వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

- 18 తులాల బంగారం రికవరీ
- వివరాలు వెల్లడించిన వెల్దండ సీఐ

వెల్దండ: వెల్దండ మండల పరిధిలోని కొట్రచౌరస్తాలో పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం వాహనాలను తనిఖీ చేస్తుండగా.. హైదరాబాద్ వైపు నుంచి కల్వకుర్తి వైపు టీఎస్ 07హెచ్‌జెడ్ 3212 బైక్‌పై అల్లం శివ వెళ్తున్నాడు. ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో కొంత బంగారం దొరికింది. దీంతో వెల్దండ పోలస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. అనంతరం వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి అందుకు సంబంధించిన పూర్తి వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట, రామకృష్ణ గుడిసెల వద్ద నివాసం ఉంటున్న అల్లం శివ.. కొన్ని నెలలుగా వెల్దండ, కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. వెల్దండ మండలంలోని పెద్దాపూర్‌లోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడి రెండు తులాల బంగారం, కుప్పగండ్లలో ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా ఊర్కొండ మండలం రేవల్లిలో మూడున్నర తులాల బంగారం, కల్వకుర్తి మండలంలోని యంగంపల్లిలో 5 గ్రాముల బంగారం, మిడ్జిల్ మండలంలోని వాడ్యాలలో 4 తులాల బంగారం చొప్పున మొత్తం 18 తులాల బంగారం చోరీ చేసినట్లు వివరాలు వెల్లడించారు. చోరీకి పాల్పడిన బంగారాన్ని అతడి నుంచి రికవరీ చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కల్వకుర్తి కోర్టుకు హాజరుపరిచి, మహబూబ్‌నగర్ జైలుకు తరలించామన్నారు. ఈ సందర్భంగా వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి, వెల్దండ పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఘరానా మోసగాడు అరెస్ట్

- త్వరలో ముఠా సభ్యులను పట్టుకుంటాం
- నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలింపు

గద్వాల క్రైం: తీగ లాగితే డొంక కదిలింది. అమాయక నిరుద్యోగులను నమ్మించి మోసం చేస్తున్న ఘరానా మోసగాడిని అరెస్ట్ చేసి అలంపూర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలియజేశారు. శుక్రవారం విలేకరులతో కేసు వివరాలను వెల్లడించారు. గద్వాల పట్టణానికి చెందిన ఎండీ ఇర్ఫాన్ కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పలువురు నిరుద్యోగులను నమ్మించాడు. గద్వాల మండలం పూడూర్‌కు చెందిన నిరుద్యోగ యువకుడు గొల్ల కృష్ణయ్య(ప్రస్తుత నివాసం గద్వాల పట్టణం బీరోలు రోడ్డు సమీపంలో నివాసం)కు ఇర్ఫాన్ పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో గద్వాల కలెక్టర్ కార్యాలయంలో మా ఏజెన్సీ ద్వారా అంటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.3 లక్షలు విడతల వారీగా ఆన్‌లైన్ చెల్లింపులు చేసేల ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు డబ్బులు చెల్లించిన నిరుద్యోగ యువకుడికి ఉద్యోగం ఇప్పిచడంలో జాప్యం చేశాడు. పలుమార్లు ఉద్యోగం విషయంపై మాట్లాడినప్పటికీ స్పందన లేకపోవడంతో ఈ నెల 5న బాధితుడు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. అయితే గురువారం సాయంత్రం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. నేరం అంగీకరించాడన్నారు. ఇలాగే మరికొంత మంది నిరుద్యోగులను సైతం మోసం చేశాడు. నిందితుడిపై ఇదే ఏడాది ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇదే తరహా కేసు నమోదైందని తెలియజేశారు. ఇర్ఫాన్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన కొంత మంది ముఠా సభ్యులు ఉన్నారన్నారు. త్వరలో వారిని సైతం అదుపులోకి తీసుకుంటామన్నారు. నిందితుడిని గురువారం రాత్రి అలంపూర్ కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవదన్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్ ఆధారంగా పరీక్షలు రాసి, అర్హత సాధించాలన్నారు. ఇలాంటి మోసగాళ్ల బారిన పడి మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు.

పాలమూరులో దొంగల ముఠా హల్‌చల్


రోడ్డు వెంట వెళ్తున్న దొంగలు

మహబూబ్‌నగర్ క్రైం: సాధారణంగా రాత్రి వేళలో పోలీసులు గస్తీలు తిరగాలి.. కానీ పాలమూరులో మాత్రం దొంగలు దర్జాగా గస్తీలు తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఐదుగురితో కూడిన దొంగల ముఠా రోడ్ల వెంట వెళ్తున్న దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇటీవల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలు జరగడం, రూ.లక్షల్లో సొమ్ములు కోల్పోవడం సర్వసాధారణంగా మారింది. రాత్రి వేళలో పెట్రోలింగ్ వ్యవస్థ పనిచేస్తుందా? లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మొదటి నుంచి లక్ష్మీనగర్ కాలనీ ఏరియాలో చోరీలు అధికం అవుతున్నా.. పోలీసులు మాత్రం సరైన దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రూరల్ ఏరియాలో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో సైతం, దొంగలు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దొంగతనం జరిగిన తర్వాత పోయిన సొమ్ము రికవరీలో చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారు.

స్థలం కాజేశారని యువకుడి ఆత్మహత్యాయత్నం

తెలకపల్లి: స్థలం కాజేశారని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. పెద్దూరుకి చెందిన వినోద్‌కుమార్‌రెడ్డికి ఆయన తండ్రి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో కొంతస్థలం కొనిచ్చాడు. దానిని అతడి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే వినోద్‌కుమార్‌రెడ్డి దివ్యాంగుడు కావడం, కొంత బుద్ధిమాంద్యత ఉండడంతో దానిని ఆసరాగా చేసుకుని.. అతడి బంధువు ఒకరు సదరు భూమిని కాజేసేందుకు కుట్ర చేశాడు. వినోద్‌కుమార్‌రెడ్డితో బాండ్ పేపర్‌పై సంతకాలు చేయించుకుని..స్థలాన్ని తనపేరు మీదకు మార్చుకున్నాడు. దీంతో విషయాన్ని గుర్తించి మనస్తాపానికి గురైన వినోద్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తన ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు అక్కడ చికిత్స పొందుతున్నాడు. కాగా వినోద్‌కుమార్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని అతడి తండ్రి పోలీసులను కోరారు. విషయం తెలుసుకున్న తెలకపల్లి ఎస్ఐ నరేష్ ఆస్పత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఎలాంటి కేసు నమోదు కాలేదని వివరించారు.

వివాహిత బలవన్మరణం

అంత్యక్రియలు నిర్వహించకపోవడంతో గ్రామస్తుల భయాందోళన

శాంతినగర్: మండలంలోని పైపాడుకు చెందిన వడ్ల సత్యమ్మ (36) ఆత్మహత్య చేసుకోవడంతో శుక్రవారం ఆమె మృతదేహానికి అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినా.. పోలీసులు కేసును తప్పుదోవ పట్టించేందుకు చూస్తున్నారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఏఎస్ఐ అయ్యన్నను వివరణ కోరగా.. పోస్టుమార్టం మధ్యాహ్నమే పూర్తయిందని, కుటుంబసభ్యులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాలేదన్నారు. కానిస్టేబుళ్లు కూడా అక్కడే ఉన్నారని తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా కేసు నమోదు చేస్తామని చెప్పడంతో స్టేషన్‌కు వస్తామని కుటుంబసభ్యులు తెలిపారని ఏఎస్ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. మధ్యాహ్నం వరకు మృతదేహం గ్రామానికి వస్తుందని చెప్పడంతో బంధువులు అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికలో గుంత తవ్వించారు. రాత్రి వరకు అంత్యక్రియలు నిర్వహించకపోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గుంత తవ్వి మృతదేహాన్ని పూడ్చకుండా వదిలేస్తే గ్రామానికి అరిష్టమని భయాందోళన చెందుతున్నారు.

డిజిటల్ మార్కెటింగ్ పుస్తకావిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డిజిటల్ మార్కెటింగ్ పుస్తకాన్ని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ మేరకు పుస్తక రచనలో కన్వీనర్‌గా అర్జున్‌కుమార్ వ్యవహరించి, డిజిటల్ మార్కెటింగ్ హెచ్‌ఆర్ అండ్ ఫైనాన్స్ రంగాలపై దీని ప్రభావం అనే అంశంపై జర్నల్స్‌ను ఐఎస్‌బీఎన్ పుస్తక రూపంలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను డిజిటల్ ప్లాట్ ఫాంల ద్వారా ఎలా అమ్ముకోవచ్చు అనే అంశంపై విస్తృతమైన సమాచారం ఉందన్నారు. డిజిటల్ మార్కెటింగ్‌పై జరిగే పరిశోధనలకు సంబంధించిన పత్రాలను సైతం ఇందులో ప్రచురించారని, పుస్తకం విద్యార్థులకు, రీసెర్చి స్కాలర్స్‌కు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, నాగసుధ, రాజశేఖర్, జిమ్మీకార్టన్, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, గాలెన్న పాల్గొన్నారు.

కుటుంబాలు ఛిద్రం

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురికి అంత్యక్రియలు
- ఇంకా విషమంగానే మరో ఐదుగురి పరిస్థితి.. నిమ్స్‌కు తరలింపు
- సాయిదీక్షిత వైద్యం కోసం దాతల సహకారం
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


చికిత్స పొందుతున్న మణెమ్మ


చికిత్స పొందుతున్న కీర్తన


చికిత్స పొందుతున్న చంద్రశేఖర్


వెంటిలేటర్‌పై సాయిదీక్షిత

ఆత్మకూర్: రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాలను ఛిద్రం చేసింది.. దైవదర్శనం చేసుకుని సంతోషంగా తిరుగు ప్రయాణమైన కుటుంబసభ్యులను కారు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కబళించింది.. ఈ దుర్ఘటనలో రెండు నెలల చిన్నారి సహా.. ఇద్దరు మృత్యువాత పడగా తీవ్రంగా గాయపడిన ఐదుగురు మెరుగైన వైద్యం చేయించుకోలేని దయనీయ స్థితి దాపురించింది. వనపర్తి జిల్లా ఆత్మకూర్‌కు చెందిన తెలుగు రాజేష్ చెందిన 26 మంది కుటుంబ సభ్యులు యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకొని గురువారం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా హైదరాబాద్‌లోని పెద్దగోల్కొండ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతిచెందిన తుఫాన్ డ్రైవర్ తాజుద్దీన్, రాజేష్ వదిన వరలక్ష్మి, ఆమె మనుమడు రెండునెలల బాబు అక్కడికక్కడే మృతిచెందారు. శుక్రవారం ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపి.. సాయంత్రం 7 గంటలకు మృతదేహాలు ఆత్మకూర్‌కు చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు.

నేరుగా శ్మశాన వాటికకే అమ్మమ్మ, మనుమడు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కర్నూలుకు చెందిన వరలక్ష్మి, ఆమె మనుమడు రెండునెలల బాబు మృతదేహాలను బంధువులు నేరుగా శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులందరూ ఆస్పత్రిలోనే ఉండటంతో వీరి మృతదేహాలను కర్నూలుకు తీసుకుపోలేని పరిస్థితిలో ఆత్మకూర్‌లోనే యువకులు, స్థానికుల సహకారంతో అంత్యక్రియలు జరిపారు. ఇలాంటి చావు ఎవరికీ రాకూడదని బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. రెండు నెలల బాబు కడసారి చూపునకు తల్లి కీర్తన నోచుకోలేక పోయిందని బంధువులు బోరున విలపించారు.

క్షతగాత్రులు నిమ్స్‌కు తరలింపు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలిక సాయిదీక్షిత కోమాలోకి వెళ్లగా.. చంద్రశేఖర్, మణెమ్మ, అర్చన, కీర్తనలను శంషాబాద్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రి నుంచి శుక్రవారం రాత్రి 7 గంటలకు నిమ్స్‌కు తరలించారు. అయితే వైద్యానికి అయిన రూ.3 లక్షలు చెల్లించాలని ఆస్పత్రి నిర్వాహకులు పట్టుబడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో కొందరు దాతలు ఫోన్‌పే ద్వారా సహకారం అందించడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో డబ్బులు చెల్లించి నిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స నిర్వహిస్తున్నారు.

కుటుంబాలను ఆదుకుంటాం..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుంటుబాలను ఆదుకుంటామని, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు చేయించేందుకు కృషిచేస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌కు చేరుకుని డ్రైవర్ తాజుద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శ్మశాన వాటికకు చేరుకుని రెండునెలల బాబుని చూసి కంటతడి పెట్టారు. వరలక్ష్మి మృతదేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి కేషం నాగరాజుగౌడ్, రహ్మతుల్లా, పరమేష్, శ్రీను, తులసిరాజ్ తదితరులున్నారు.


మృతిచెందిన రెండు నెలల పసికందును చూస్తూ కంటతడి పెట్టిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూ ర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, ఏపీ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ పి.రాజశేఖర్ శుక్రవారం దర్శించుకున్నారు.

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక



మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొత్సకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు

వైద్యవిద్య ప్రవేశాలు, ఆసుపత్రుల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానాల్లో వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో డీఎంఈ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనుండగా, డీఎంఈ (అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల ప్రవేశాల ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. దీంతోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్, ఓపీ, ఐపీ, మాతాశిశు సంరక్షణ సేవలు, పోస్టుమార్టం వంటి అన్ని విభాగాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టనుంది. నిశితంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది.

ఇస్రో అమ్ములపొదిలోకి మరో రాకెట్

ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి సురక్షితంగా చేరిన ఈవోఎస్-08, డెమోశాట్ ఉపగ్రహాలు



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమ్ముల పొదిలోకి మరో రాకెట్ చేరింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) డి-3 ప్రయోగాన్ని శుక్రవారం ఉదయం విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈవోఎస్-08), ఎస్ఆర్-0 డెమోశాట్ అనే రెండు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగానికి శుక్రవారం తెల్లవారుజామున 2.47 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. అరున్నర గంటలపాటు కౌంట్‌డౌన్ అనంతరం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్‌వీ డి-3 రాకెట్ నింగివైపునకు దూసుకెళ్లింది. రాకెట్‌లోని మొత్తం నాలుగు దశలు సక్రమంగా పనిచేయడంతో 16.56 నిమిషాల్లోనే ప్రయోగం విజయవంతంగా ముగిసింది. భూమికి 475 కిలోమీటర్ల ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లో 37.2 డిగ్రీల వృత్తాకారపు కక్ష్యలోకి విజయవంతంగా ఉప గ్రహాలను ప్రవేశపెట్టారు. మొదట ఈవోఎస్-08ను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఎస్ఆర్-0 డెమోశాట్ అనే చిన్న ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడంతో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ఇస్రో చిన్న తరహా ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ అందుబాటులోకి రావడంతో వాణిజ్యపరమైన ప్రయోగాల్లో తిరుగులేని శక్తిగా ఇస్రో ఎదుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఇవీ ఉపయోగాలు...

ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-08లో ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం-రిఫ్లెక్టోమెట్రీ, ఎస్ఐసీ యూవీ డొసిమీటర్ అనే మూడు రకాల పేలోడ్స్‌ను అమర్చారు. వీటి ద్వా రా ఈ ఉపగ్రహం భూమి మీద వాతావరణ పరిస్థితులు(భౌగోళిక-పర్యావరణం)పై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ సమాచారాన్ని చేరవేస్తుంది. ముఖ్యంగా అటవీ, వ్యవసాయం, భూమి స్వభావం, నీరు, నేల తీరు అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. ఇది భవిష్యత్తులో ప్రయోగించనున్న గగన్‌యాన్ మాడ్యూల్‌కు అవసరమైన వాతావరణ పరిస్థితులను కూడా అధ్యయనం చేస్తుంది. మైక్రోశాట్ ఉపగ్రహాల్లో అత్యంత అధునాతన టెక్నాలజీ కలిగిన ఈ ఉప గ్రహం ఒక్క సంవత్సరం మాత్రమే సేవలు అందిస్తుంది.

ఇస్రోకు సరికొత్త రాకెట్ అందుబాటులోకి వచ్చింది

ఇస్రో చైర్మన్ సోమనాథ్



ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతూ ఇస్రోలో సరికొత్తగా ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ చేరిందని చెప్పారు. ఇప్పటిదాకా ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్-3 వంటి ఐదు రకాల రాకెట్లు మాత్రమే ఉండేవని తెలిపారు. 2022 ఆగస్టు 7న ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ డి-1 రాకెట్ విఫలం కావడంతో అందులో ఏర్పడిన లోపాలను సరిచేసుకుని పలు ముందస్తు పరీక్షలు నిర్వహించి ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగానికి సిద్ధమయ్యామని పేర్కొన్నారు. దీనికోసం అహర్నిశలు పనిచేసిన ఇస్రోలోని అన్ని విభాగాల టీమ్‌లకు అభినందనలు తెలిపారు వాణిజ్యపరంగా కూడా ఈ రాకెట్‌ను వినియోగిస్తామని చెప్పారు. వెహికల్ డైరెక్టర్ ఎస్ఎస్ వినోద్, శాటిలైట్ డైరెక్టర్ ఎ.అవినాశ్ మాట్లాడుతూ ఉపగ్రహం నుంచి నిర్దేశించిన విధంగా సిగ్నల్స్ అందాయని తెలిపారు. కాగా, ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు.

కృషి ఫలించింది.. గేటు పడింది

తుంగభద్ర డ్యాం స్టాప్‌లాగ్ గేటు తొలి భాగం అమరిక

- నేడు మరో రెండు భాగాలు ఏర్పాటు



గేటును విజయవంతంగా అమర్చుతున్న దృశ్యం

సాక్షి, బళ్లారి/ హొసపేటి/అనంతపురం సెంట్రల్: వారం రోజులుగా ఇంజినీర్లు చేస్తున్న కృషి ఫలించింది. తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు విజయవంతంగా మొదలైంది. స్టాప్‌లాగ్ గేట్‌లో మొదటి భాగాన్ని శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రత్యేక నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఇంజినీర్లు, కార్మికులు విజయవంతంగా అమర్చారు. 15 టన్నులు బరువుతో 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పు ఉన్న ఈ భాగాన్ని భారీ క్రేన్ల సాయంతో అమర్చారు. ఇక్కడ మరో నాలుగు భాగాలు అమర్చాల్సి ఉంది. శనివారం రెండు, మూడు భాగాలు అమర్చడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత డ్యాం నుంచి 60 టీఎంసీల నీటిని వదిలేసి, 40 టీఎంసీలకు చేరుకున్నాక గేటు అమర్చాల్సి ఉంటుందని నిపుణులు చెప్పారు. అయితే నీటి వృథాను అడ్డుకొని రైతులకు అందించే లక్ష్యంతో స్టాప్‌లాగ్ గేటును అమర్చుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 72 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, మొదటి భాగాన్ని విజయవంతంగా అమర్చారు. మిగిలిన భాగాల ఏర్పాటులో పెద్ద అవరోధాలు ఉండవని డ్యాం అధికారులు తెలిపారు.

భర్తకు జీవిత ఖైదు సరైందే

భార్య హత్య కేసులో ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: భార్య హత్య కేసులో భర్తకు ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించడం సరైందేనని హైకోర్టు స్పష్టం చేసింది. 'మృతిరాలితో అప్పీలెంట్ (భాస్కర్)కు వివాహం జరిగి నాలుగు నెలలే అయ్యింది. ఆమె మంటల్లో కాలిపోతున్నప్పుడు గదిలో నిందితుడు ఉన్నాడని సాక్ష్యులు చెబుతున్నారు. ఆ మంటలను ఆర్పేందుకు అతను ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భర్తకు వ్యతిరేకంగా మృతురాలు తప్పుడు వాంగ్మూలం ఇచ్చిందనడానికి ఎలాంటి కారణాలు లేవు. ట్రయల్ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదు' అని హైకోర్టు తీర్పునిచ్చింది. 2012లో జరిగిన హత్య కేసులో అప్పీలెంట్‌కు జీవిత ఖైదు సరైందేనని 2015లో తేల్చిచెప్పింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పెద్దింటి భాస్కర్‌కు మృతురాలితో 2012, ఏప్రిల్ 25న వివాహం జరిగింది. వివాహం తర్వాత నెల పాటు దంపతులు భార్య తల్లిగారింట్లోనే ఉన్నారు. 2012, జూలై 15న రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించారు. అయితే తనకు పీడకలలు వస్తున్నాయని, తల్లి వద్ద నిద్రిస్తానని భాస్కర్‌ను కోరింది. అందుకు నిరాకరించి దుర్భాషలాడుతూ ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆసుపత్రిలో మృతురాలు మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా భాస్కర్‌ను ట్రయల్ కోర్టు దోషిగా నిర్ధారించింది.

బాధితురాలి మానసిక స్థితి బాగానే ఉంది...

2015, ఏప్రిల్ 17న రంగారెడ్డి జిల్లా కోర్టు తనకు యావజ్జీవ శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పెద్దింటి భాస్కర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జితేందర్‌రావు వీరమల్ల వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మృతురాలి తల్లి కూడా నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వలేదని, పథకం ప్రకారం హత్య చేశాడని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... బాధితురాలి నుంచి మేజిస్ట్రేట్ వాంగ్మూలం తీసుకునేముందు ఆమె మానసిక పరిస్థితి బాగానే ఉందని డాక్టరు ధ్రువీకరించారని పేర్కొంది. మరణ వాంగ్మూలం ఆధారంగా శిక్ష విధించవచ్చని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ప్రస్తావిస్తూ అప్పీలును కొట్టివేసింది.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు గడువు ఈనెల 30

సాక్షి, హైదరాబాద్: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాలనుకునే వారు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీజీ శ్రీహరి తెలిపారు. ప్రతీ పేపర్‌కు రూ.25 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4 వరకు, రూ.50 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 9 వరకు ఫీజు చెల్లించాలని వెల్లడించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగుతాయన్నారు. వివరాలకు http://www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బాబు తప్పిదం వల్లే.. 'వాల్' ఢమాల్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరం డయాఫ్రమ్‌వాల్‌పై సీడబ్ల్యూసీకి అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక

2017, 2018లో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్‌వాల్ మీదుగా వరద ప్రవాహం

- ఆ ప్రభావం డయాఫ్రమ్‌వాల్‌పై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదన్న కమిటీ
- వరదల ఉధృతికే డయాఫ్రమ్‌వాల్ 693 మీటర్ల పొడవున దెబ్బ తిన్నట్లు స్పష్టీకరణ
- 2017లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పునాదులు జెట్ గ్రౌటింగ్ వాల్‌ల నిర్మాణం
- వరద ప్రభావం వాటిపై పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోని టీడీపీ సర్కారు
- 2018 వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్‌లో 200 -260 మీటర్ల మధ్య దెబ్బతిన్న జెట్ గ్రౌటింగ్ వాల్

పరిశోధనల్లో మార్పులను గుర్తించాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు పరిశోధనల్లో వస్తున్న కొత్త మార్పులను గమనించాలని.. తద్వారా పరిశోధనలు మరింత సులభం అవుతాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఎక్స్‌టెన్షన్ లెక్చరర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశోధనల్లో కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో టెక్నాలజీని జోడిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వాటిపై రీసెర్చి స్కాలర్స్ పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. గ్రామీణ స్థాయి విద్యార్థులు గేట్, నెట్ వంటి వాటిలో ఉత్తీర్ణత సాధించి సీఎస్ఐఆర్ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో పరిశోధనలు చేసేందుకు అవకాశం పొందవచ్చన్నారు. సైన్స్ పరిశోధనలు, కెరియర్, అవకాశాలు తదితర అంశాలపై విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

50 కంపెనీలు.. 2 వేలకుపైగా ఉద్యోగాలు



జాబ్‌మేళాకు సంబంధించి ఇటీవల పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్ తదితరులు

యువత సద్వినియోగం చేసుకోవాలి

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలి. 50కి పైగా ప్రముఖ కంపెనీలు హాజరై 2000 లకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. కోస్గిలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాను ఉమ్మడి జిల్లాతోపాటు కొడంగల్ యువతియువకులు సద్వినియోగం చేసుకోవాలి. - యోగేష్ గౌతం, ఎస్పీ

- నేడు కోస్గిలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా
- ఉమ్మడి జిల్లా పరిధిలో ఎంపికలు
- 10వ తరగతి నుంచి బీటెక్ వరకు అందరికి అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ యోగేష్ గౌతమ్

కోస్గి: గతంలో ఎన్నడు లేని విధంగా జిల్లా పోలీస్ శాఖ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తుంది. నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ సౌజన్యంతో కోస్గి కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. కోస్గిలోని పంచాక్షరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ, ఐటీఐ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివిన వారు సైతం ఎంపికకు హాజరు కావచ్చునన్నారు. కనీస వేతనం రూ.12000 నుంచి రూ.40,000 వరకు ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ శాఖ సూచిస్తుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రచారం నిర్వహించారు.

స్కాన్ చేసి ఆన్‌లైన్‌లోనే వివరాల నమోదు..

ఈ జాబ్ మేళాకు వచ్చే వారు ఉన్న చోటనే బయోడేటాను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేలా క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. పోలీస్ శాఖ విడుదల చేసిన ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా రిజిస్ట్రేషన్ ఫాం నింపి అప్‌లోడ్ చేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థులు తమ విద్యార్హత ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లతో రావాల్సి ఉంటుంది.

హెచ్‌సీఏ టోర్నీలో పాలమూరు శుభారంభం



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు

54 పరుగుల తేడాతో నాగార్జున స్కూల్ జట్టుపై విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి ప్రారంభమైన హెచ్‌సీఏ అండర్- 16 స్కూల్, కళాశాల టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు శుభారంభం చేసింది. హైదరాబాద్‌లోని ఏఎన్‌సీజీ- 3 మైదానంలో జరిగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు 54 పరుగుల తేడాతో నాగార్జున స్కూల్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 30.2 ఓవర్లలో 98 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో ప్రణవ్ కార్తికేయ 20 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నాగార్జున స్కూల్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 20.5 ఓవర్లలో 44 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు డి.అభినవ్ 3, బి.కాన్షిక్‌గౌడ్ 3, మణిచరణ్ 2 వికెట్లు తీశారు. మొదటి మ్యాచ్‌లో జిల్లా జట్టు విజయం సాధించడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. ఇదే పట్టుదలతో ఆడి టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు.

సుంకేసులకు 95 వేల క్యూసెక్కుల వరద



సుంకేసుల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

రాజోళి: సుంకేసుల జలాశయం 22 గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం ఎగువ నుంచి 95,200 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 92,729 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు తరలిస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు.

తుమ్మిళ్ల నీటి విడుదల

శాంతినగర్ : ఆర్డీఎస్ కెనాల్‌కు తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా శుక్రవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఐదు రోజుల కిందట డి-29 సమీపంలో ఆర్డీఎస్ కెనాల్ కోతకు గురవడంతో నీరంతా పంటల్లోని వెళ్లడంతో మునిగిపోతాయని ఆర్డీఎస్ అధికారులు మోటార్‌ను బంద్ చేశారు. శుక్రవారం మోటార్ తిరిగి ప్రారంభించి డి-23 తనగల సమీపంలోని ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,021 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 1,150 క్యూసెక్కులు, వివిధ లిఫ్టులకు 854 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

జూరాలకు తగ్గిన వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం సాయంత్రానికి 17,500 క్యూసెక్కులకు తగ్గినట్లు చెప్పారు. ఎగువ జల విద్యుత్‌కేంద్రంలో 2 యూనిట్లలో ఉత్పత్తి కొనసాగుతోందని.. ఇందుకోసం 13,690 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామన్నారు. ఆవిరిరూపంలో 93 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వకు 742, ఎడమ కాల్వకు 920, కోయిల్‌సాగర్‌కు 630, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 500, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులు తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు.. ప్రస్తుతం 9.214 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలంలో 881.4 అడుగులు..

అచ్చంపేట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 881.4 అడుగుల నీటిమట్టం, 195.6605 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల జలాశయం నుంచి 92,729 క్యూసెక్కులు, జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 13,690 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతుంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,540 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,206 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 26,625 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు 1,520 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.738 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.294 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

తుంగభద్ర జలాశయాన్ని సందర్శించిన అలంపూర్ ఎమ్మెల్యే



కర్ణాటక అధికారులతో మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయాన్ని శుక్రవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కర్ణాటక గృహనిర్మాణశాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, కంప్లీ ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌తో కలిసి సందర్శించారు. వరద ఉధృతికి షట్టర్ కొట్టుకుపోవడంతో ప్రస్తుతం కొనసాగుతున్న మరమ్మతుల గురించి ప్రాజెక్ట్ ఎస్ఈఈ శ్రీకాంత్‌రెడ్డి, డీఈఈ జ్ఞానేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో 71 టీఎంసీల నీటి నిల్వ ఉండగా.. గేట్ కొట్టుకుపోవడంతో 34 టీఎంసీల నీరు వృథాగా కిందకు పారిందని వివరించారు. ఐదు ఎలిమెంట్లు ఏర్పాటు చేయడంతో నీటి వృథాను అరికట్టవచ్చని ఇంజినీర్లు వివరించారు. జలాశయానికి 27 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 65 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు పారుతుందన్నారు. ఏదేమైనా ఆర్డీఎస్‌కు వేసవిలో పుష్కలంగా నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వావిలాల రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గజేంద్రరెడ్డి, సంకాపురం రాముడు, అమరవాయి రవి, చిన్న హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

హొస్పేట్‌కు పయనం..

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడేందుకు శుక్రవారం ఎమ్మెల్యే విజయుడు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కర్ణాటకలోని హొస్పేట్ జలాశయానికి వెళ్లారు.

మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

మహబూబ్‌నగర్ రూరల్: స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు ప్రజలకు అందలేదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు, పాలకవర్గాలు ఎర్రతివాచి పరిచి, అట్టడుగు ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. స్వాతంత్ర్య ఫలాల సంరక్షణ కోసం దేశంలో ధర్మయుద్ధం చేయటానికి యువతరం నడుంబిగించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 78 ఏళ్ల స్వాతంత్ర్యంలో 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 40 కోట్ల నిరుద్యోగ సైన్యం పెరిగిందని, 46 కోట్ల మంది ప్రజలు దారిద్రరేఖకు దిగువన నివసిస్తున్నారని చెప్పారు. మరోవైపు 169 మంది శతకోటీశ్వరులు ఎదిగి, ఆదాని ప్రపంచంలో నంబర్ 2 కుబేరుడిగా అయ్యాడని తెలిపారు. 40 శాతం మంది ప్రజల ఆస్తి ఒక శాతం చేతుల్లో మగ్గుతుందన్నారు. సామాజికంగా కుల వివక్ష, అంటరానితనం నేటికీ కొనసాగుతుందని అన్నారు. సామాజిక ఆర్థిక అంతరాలను తొలగించకుంటే దేశంలో మరో స్వాతంత్ర్య పోరాటానికి యువతరం నడుంబిగించాలని చెప్పారు. మతోన్మాదం ఏ దేశంలో ఉన్నా.. ప్రమాదమే అన్నారు. సెమినార్‌లో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు, జిల్లా కార్యదర్శి మీసాల కుర్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఆది విష్ణువర్ధన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంచాలని తండ్రిపై కుమారుల దాడి

- కేసు నమోదు

లింగాల: మండల పరిధిలోని మగ్దూంపూర్‌కు చెందిన పుల్లయ్యపై కుమారులు దాడి చేసి గాయపర్చిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమారులు కిరణ్, ఆనంద్ ఆస్తిని పంచాలని తరచుగా తండ్రిని వేధింపులకు గురిచేస్తూ.. వస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత పంపకాలు చేస్తానని చెప్పినా వినిపించుకోకుండా ఇద్దరు కుమారులు కలిసి తండ్రిపై ఇటుకలతో దాడికి పాల్పడగా.. తలకు బలమైన గాయమైంది. బాధిత వ్యక్తి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలియజేశారు.